సాక్షి జనగామ

7

మంగళవారం | 20 | ఫిబ్రవరి | 2024

న్యూస్‌రీల్

ఎమ్మెల్యేను కలిసిన మున్సిపల్ కమిషనర్



జనగామ: మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లు సోమవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని జిల్లా కేంద్రంలోని వికాస్‌నగర్ క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. ఏఈ మహిపాల్ ఉన్నారు.

'ఛత్రపతి' శోభాయాత్ర



జనగామ: ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని సోమవారం రాత్రి జిల్లా కేంద్రంలో శోభా యాత్ర నిర్వహించారు. రైల్వే స్టేషన్ నుంచి నెహ్రూపార్కు మీదుగా ఆర్టీసీ చౌరస్తా వరకు యాత్ర కొనసాగింది. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఛత్రపతి మహరాజ్‌కీ జై అంటూ ముందుకు సాగారు.

చిన్నారి రిహాన్షికి అవార్డు



జనగామ: పట్టణానికి చెందిన మైత్రేయ కూచిపూడి కళాక్షేత్రం మాస్టర్ పులిగిల్ల సుభేష్ వద్ద శిక్షణ పొందుతూ.. ఈనెల 7వ తేదీన 48 నిమిషాల పాటు కూచిపూడి నృత్యం, 41 వేమన పద్యాలు చెప్పి హై రేంజ్ బుక్ ఆఫ్ రికార్డు సొంతం చేసుకున్న ఐదేళ్ల చిన్నారి రిహాన్షి.. సినీ హీరో సుమన్ చేతుల మీదుగా రుద్రమదేవి అవార్డు అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లో రుద్రమదేవి అకాడమీ నిర్వాహకులు మాస్టర్ రవి, మాస్టర్ లక్ష్మి ఆధ్వర్యంలో అవార్డు బహూకరణ జరిగింది.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



జనగామ: కరాటే పోటీల్లో జనగామ సెయింట్ పాల్స్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు. హైదరాబాద్ యూసుఫ్ గూడ కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఈనెల 17, 18 తేదీల్లో జాతీయ స్థాయి రుద్రమదేవీ మెగా కప్పు కరాటే పోటీల్లో నిర్వహించారు. ఇందులో పెద్దపల్లి అశ్వంత్, మల్కాపురం సాయిప్రతీక్, కనుగంటి లిఖిత గోల్డ్ మెడల్, పెద్దపల్లి యశ్వంత్, ఏషబోయిన భువనేశ్వరి, మల్కాపురం హరిప్రీత్, కనుగంటి వర్షిణి, బండి అక్షర సిల్వర్ మెడల్ సాధించారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రిన్సిపాల్ మరియజోసఫ్ తల్లిదండ్రులతో పాటు విద్యార్థులను సత్కరించారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు



జనగామ: గ్రామాలు, పట్టణాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని జనగామ ఏసీపీ ఎస్ఆర్.దామోదర్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం తరిగొప్పుల, నర్మెట మండలాలకు చెందిన బెల్ట్ షాపుల నిర్వాహకులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక నుంచి బెల్టు షాపులు ఉండొద్దు.. నిబంధనలను పట్టించుకోకుండా మద్యం విక్రయాలు జరిపితే అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని స్పష్టం చేశారు. పోలీసుల ఆధ్వర్యంలో నిరంతరం తనిఖీలు చేపడుతామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్: సీఎం విదేశీ విద్యా ఉపకార వేతన పథకానికి అర్హులైన మైనార్టీలు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి సయ్యద్ ఇస్మాయిల్ ఒక ప్రకటనలో తెలిపారు. అమెరికా, ఆస్ట్రేలియా, జర్మనీ, ఫ్రాన్స్, కెనడా, లండన్, జపాన్, సింగపూర్ దేశాల్లో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు చదవడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈనెల 20 నుంచి మార్చి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, హార్డ్ కాపీలను కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

అర్జీల స్వీకరణకే పరిమితం

- పరిష్కారానికి నోచుకోని ప్రజాసమస్యలు
- గ్రీవెన్స్‌కు 54 వినతులు
- స్వీకరించిన కలెక్టర్ శివలింగయ్య

జనగామ రూరల్: 'తమ్ముడి మృతితో కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు.. కలెక్టర్ ఆదేశించినా అధికారులు పని చేయడం లేదు.. వారసత్వ భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నారు'.. ఇలా అనేక సమస్యలపై సోమవారం గ్రీవెన్స్‌లో ప్రజలు వినతులు సమర్పించారు. సుదూర ప్రాంతాల నుంచి వ్యయప్రయాసలకోర్చి వచ్చి అందజేసిన అర్జీలు అధికారులు స్వీకరించడానికే పరిమితమవుతున్నారు.. ఏళ్ల తరబడి సమస్యలు పరిష్కారం కావడంలేదంటూ దరఖాస్తుదారులు వాపోయారు. మొత్తం 54 దరఖాస్తులు రాగా వాటిని స్వీకరించిన అనంతరం కలెక్టర్ శివలింగయ్య అధికారులతో మాట్లాడారు. వినతులను క్షుణ్ణంగా పరిశీలించి తమ పరిధిలోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఈ సందర్భంగా సంబంధిత అధికారులను ఆదేశించారు.

తాగునీటికి తప్పని ఇబ్బందులు

చలికాలంలోనూ వేసవిని తలపించేలా మధ్యాహ్నం ఎండలు ఉండడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు కనీసం తాగునీటి వసతి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చంటి పిల్లలతో వచ్చిన మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు కూర్చోవడానికి కనీసం కుర్చీలు లేక అవస్థలు పడాల్సి వచ్చింది.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శివలింగయ్య, అదనపు కలెక్టర్లు, అధికారులు

వర్షాకాలం రాకపోకలకు ఇబ్బందులు



చీటకోడూర్‌లోని వాగు కల్వర్టు గత వానాకాలం వరద కారణంగా దెబ్బతిని ఒక వైపు పూర్తిగా కొట్టుకుపోయింది. ఈ గ్రామం నుంచి చౌడారం మరిగడితో పాటు రఘునాథపల్లి మండలానికి చాలా మంది వెళ్తుంటారు. చౌడారంలోనే కేజీబీవీ, మోడల్ పాఠశాలలు ఉన్నాయి. ఈసారి వర్షాకాలం రోడ్డు మొత్తం కొట్టుకుపోయే పరిస్థితి ఉంది. అధికారులు తక్షణమే రోడ్డు మమ్మతు చేయాలి.

– యాసారపు కర్ణాకర్, చౌడారం



ఈ ఫొటోలోని మహిళ పేరు కల్లూరు రాణి. లింగాల ఘణపురం మండలం కళ్లెంకు చెందిన ఈమె భర్త 2003లో గుండె పోటుతో మృతి చెందాడు. అప్పటి నుంచి ఇద్దరు ఆడ పిల్లలతో తల్లిగారి ఇంటి వద్ద బతుకుతోంది. పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న తమ్ముడు రాజు కుటుంబ భారం మోస్తున్నాడు. అయితే ఈ ఏడాది జనవరిలో తమ్ముడు కూడా గుండె పోటుతో మరణించడంతో అతడిపై ఆధారపడిన తల్లి, కుమార్తెలు రోడ్డున పడ్డారు. ఎలాంటి ఆధారంలేదు.. ఉపాధి చూపించి ఆదుకోవాలని రాణి వేడుకుంది.

రెండేళ్ల నుంచి తిరుగుతున్నా..



ఎస్ఆర్ నమోదు.. బదిలీకి సంబంధించిన సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా తక్షణమ పరిష్కారించాలని ఆదేశించారు. కాగా సంబంధిత ఎస్సీ సంక్షేమాధికారి పరిష్కరించలేదు. మూడు రోజుల క్రితం బదిలీపై వచ్చిన కొత్త అధికారి చార్జ్ తీసుకోలేదు. కలెక్టర్ మరో రెండు రోజులు అగుమన్నారు. రెండేళ్ల నుంచి తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు.

– శ్రీనివాస్, స్టేషన్‌ఘన్‌పూర్ ఎస్సీ హాస్టల్ వర్కర్

టీచర్లు, ఆయాలను తొలగించాలి



కోడూర్‌లోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే టీచర్లు, ఆయాలు పిల్లలకు గుడ్లు, పాలు, ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రయోజనాలు అందజేయడంలేదు. బాలింతలను పట్టించుకోకుండా వారికి వచ్చే నిత్యవసరాలు సైతం ఇవ్వడం లేదు. వారిని తొలగించాలని గ్రామస్తులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

– రఘునాథపల్లి మండలం కోడూర్ గ్రామస్తులు

నాణ్యతా ప్రమాణాలు తెలుసుకోవాలి

- కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య

జనగామ: వినియోగదారులు వస్తువులు కొనుగోలు చేసే ముందు వాటి నాణ్యతా ప్రమాణాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ శివలింగయ్య అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో 'బీఐఎస్ కేర్' యాప్‌పై జిల్లా అధికారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వస్తువుల నాణ్యతను తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరూ భారతీయ ప్రమాణాల సంస్థ యాప్‌ను సెల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. గురుకులాలు, పాఠశాలలు, వసతి గృహాలకు సరఫరా చేసే వస్తువుల నాణ్యతను 'బీఐఎస్ కేర్' యాప్ ద్వారా గుర్తించాలని చెప్పారు. జాయింట్ డైరెక్టర్, సైంటిస్ట్ సవిత మాట్లాడుతూ ఐఎస్ఐ మార్క్ ఉన్న వస్తువులను మాత్రమే కొనుగోలు చేసేలా మెడికల్, అగ్రికల్చర్, విద్యుత్, రోడ్లు భవనాలు, మార్కెటింగ్, లీగల్ మెట్రాలజీ తదితర శాఖల ఉన్నతాధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ మేరకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పర్మర్ పింకేశ్ కుమార్, డీఎస్‌ఓ రోజారాణి, అభిలాష్, సాధిక్ అలీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

'స్వీప్' కార్యక్రమాలు నిర్వహించాలి

జనగామ రూరల్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటరు టర్న్ అవుట్ పెరిగేలా 'స్వీప్' కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. కలెక్టరేట్‌లో కలెక్టర్ శివలింగయ్య, అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్ పింకేష్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు. వికాస్‌రాజ్ మాట్లాడుతూ జనవరి 1 వరకు 18 ఏళ్లు నిండిన ప్రతి ఓటరు పేరు జాబితాలో పొందుపరిచామని, అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా మరోసారి ధ్రువీకరించుకోవాలన్నారు. మార్పులు చేర్పులపై రాజకీయ నాయకులకు సమాచారం అందించాలని చెప్పారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఏఓ, జెడ్పీ సీఈఓ, ఆర్డీఓ పాల్గొన్నారు.

వైభవంగా 'ఆరుద్రోత్సవం'



సోమేశ్వరాలయంలో స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకుడు

పాలకుర్తి టౌన్: శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో సోమవారం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ఉత్సవాన్ని మేళతాళాలు, అర్చకుల వేద మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు ఏకదశ రుద్రాభిషేకం, 108 లీటర్ల ఆవుపాలతో అభిషేకం చేశారు. గర్భాలయ దీపోత్సవం, పుష్పాలంకరణ, విశేష నీరాజనములు, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు. శ్రీరామదాసు భజన మండలి బృందాలు నిర్వహించిన భజనలు అలరించాయి. కార్యక్రమంలో ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ సాధనకు మరో పోరాటం

- ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రతినిధులు

దేవరుప్పుల : ఆరె సామాజిక విద్యావంతులకు ఓబీసీ సాధన కోసం మరో పోరాటం అనివార్యం.. ఛత్రపతి శివాజీ మహరాజ్ పోరాట స్ఫూర్తితో రాజకీయాలకు అతీతంగా ఏకం కావాలని ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ, వర్కింగ్ అధ్యక్షులు నాగుర్ల వెంకటేశ్వర్‌రావు, చెట్టిపల్లి శివాజీ అన్నారు. సోమవారం కడవెండిలో ఆరె సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం దరగాని కోటేశ్వర్‌రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. దశాబ్ద కాలంగా సంఘం చేసిన పోరాట ఫలితంగా ఆరెలను ఓబీసీల్లో చేర్చేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సానుకూల ప్రకటన చేసిందన్నారు. ఈ విషయంలో తేడా వస్తే ఐక్య సంఘటనతో మరో పోరాటానికి సిద్ధం కావాలన్నారు. ఈ సందర్భంగా విగ్రహ దాతలు దరగాని యశోద-సోమాజీ, మైనాల అమరావతి-భాస్కర్, కొడగాని ప్రవళిక-నాగేశ్వర్‌రావులను సత్కరించారు. అనంతరం దొడ్డి కొమురయ్య స్మారక భవనంలో అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో చెన్నగారి కృష్ణారావు, మారుజోడు రాంబాబు, రాజేష్, మాసంపెల్లి లింగాజీ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న నాగుర్ల వెంకటేశ్వర్లు

అద్దె బస్సు డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

జనగామ రూరల్: ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి.. లేదంటే 21 నుంచి సమ్మె చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఏఓ రవీందర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం యూనియన్ కార్యాలయంలో భిక్షపతి అధ్యక్షతన జరిగిన హైర్ బస్సు డ్రైవర్లు, క్లీనర్ల యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్ల కుటుంబ నిర్వహణ భారంగా మారిందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా నెలకు రూ.26 వేల వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఎం.రాజు, వెంకటేశ్వర్లు, భాస్కర్, పరశురాములు, రమేష్ పాల్గొన్నారు.

లేని రోగం అంటగట్టారు..

- మందులు వాడిన వృద్ధుడికి తీవ్ర అస్వస్థత
- బాధ్యులపై చర్య తీసుకోవాలని బాధితుడి కుమారుడి డిమాండ్

పాలకుర్తి టౌన్: 'దగ్గు, జ్వరం ఉందని పరీక్షలు చేయించుకుంటే ల్యాబ్ నిర్వాహకులు టీబీ ఉందని రిపోర్టు ఇచ్చారు. పాలకుర్తి ప్రభుత్వ వైద్యులు ఇచ్చిన మందులు వాడిన వృద్ధుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. బాధ్యులపై చర్య తీసుకోవాలి' అని బాధితుడి కుమారుడు యాకయ్య డిమాండ్ చేశాడు. అతడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాలకుర్తి మండలం చెన్నూరుకు చెందిన వృద్ధుడు మొలుగూరి వీరసోమయ్య దగ్గు, జ్వరంతో ఇబ్బంది పడుతున్నాడు. ఈనెల 5న పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లగా వైద్యులు జనగామ ల్యాబ్‌కు వెళ్లి పరీక్ష చేయించుకోమన్నారు. జనగామ ప్రభుత్వ ల్యాబ్‌లో టెస్ట్ చేయించుకోగా క్షయవ్యాధి ఉన్నట్లు రిపోర్టు ఇచ్చారు. అది తీసుకుని పాలకుర్తి ఆస్పత్రి వైద్యులకు చూపగా వారానికి సరిపడా మందులు పంపించారు. వాటిని వాడిన వృద్ధుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. రోజులు గడుస్తుండగా.. ఊపిరి తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు వీరసోమయ్యను వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు టీబీ మందులు వాడడం వల్లే ఆరోగ్యం క్షీణించిందని నిర్ధారించారు. దీంతో లేని రోగం అంటగట్టారని బాధితుడి కుమారుడు మొలుగూరి యాకయ్య, అతడి కుటుంబ సభ్యులు పాలకుర్తి పోలీస్‌స్టేషన్, జిల్లా వైద్యాధికారులకు ఫిర్యాదు చేశారు. తన తండ్రి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని, ఏమైనా జరిగితే ప్రభుత్వ అస్పత్రి వైద్యులు బాధ్యత వహించాలని యాకయ్య ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీరసోమయ్య

క్షయ వ్యాధి కాదని నిర్ధారణ చేశారు..

ఈ విషయమై వైద్యాధికారి లింగమూర్తిని వివరణ కోరగా.. 'వీరసోమయ్య దగ్గు, జ్వరంతో ఆస్పత్రికి రాగా జనగామ ఏరియా ఆస్పత్రికి పరీక్ష కోసం పంపించాం. జనగామ ల్యాబ్ టెక్నీషియన్ సీబీ నాట్ పరికరంతో పరీక్షలు చేయగా క్షయ వ్యాధి కాదని నిర్ధారణ చేశారు. తరువాత వీరసోమయ్య హనుమకొండ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి ఎక్స్‌రే ద్వారా పరీక్ష చేయించుకోగా క్షయవ్యాధి ఉందని వైద్యులు నిర్ధారించారు. ఆ రిపోర్టును తాము పరిశీలించి మందులు ఇచ్చాము' అని చెప్పారు.

సామాన్య భక్తులే వీఐపీలు



మేడారం దారిలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు


- సాఫీగా తల్లుల దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు
- అమ్మవార్లకు సేవ చేయడం అదృష్టం
- శిలాశాసనంపై సమ్మక్క, సారలమ్మ జాతర చరిత్ర
- ఈసారి సీఎంతోపాటు మంత్రులంతా వస్తారు..
- 'సాక్షి'తో రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క

ఏటూరునాగారం/ఎస్ఎస్‌తాడ్వాయి:

'రేపటి నుంచి 24వరకు జరగనున్న మేడారం మహాజాతరకు తరలివచ్చే సామాన్య భక్తులే మాకు వీఐపీలు. వారికి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాం. ఈసారి ప్రైవేట్ వాహనాల పార్కింగ్ స్థలాల విస్తీర్ణాన్ని పెంచాం. ఎక్కడా ట్రాఫిక్ జామ్‌కాకుండా పోలీస్‌శాఖ ఆధునిక టెక్నాలజీని వినియోగిస్తోంది. డిజిటల్ ప్రపంచం కావడం.. ప్రతి ఒక్కరి చేతిలోమొబైల్ ఫోన్ ఉండడంతో ఎప్పటికప్పుడు జాతర అప్‌డేట్స్ అందించేందుకు ప్రత్యేక వెబ్‌సైట్, యాప్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు. మహిళా భక్తులకు ప్రత్యేక వసతులు కల్పిస్తున్నాం. నిరంతరం వైద్యసేవలు అందుబాటులో ఉంటున్నాయి' అని రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క తెలిపారు. మేడారం మహాజాతర సందర్భంగా సోమవారం ఆమె 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆమె మాటల్లోనే..

వనదేవతలను తీసుకొచ్చే క్రమంలో తాకే ప్రయత్నం చేయొద్దు

జాతరలో ప్రతీసారి కూడా ముందుంటున్నాం. ఆదివాసీ బిడ్డలు, యూత్ సభ్యులు సమ్మక్క, సారలమ్మను గద్దెలకు తీసుకొచ్చే క్రమంలో తాకాలని భక్తులు ప్రయత్నించొద్దు. దూరం నుంచి దర్శించుకోవాలి. అనుభవమైన వారితో రోప్ పార్టీలను గతం కంటే ఈసారి పకడ్బందీగా ఏర్పాటు చేశాం. రోడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించాం. రోడ్ల మీద ఉన్న షాపుల వారికి విజ్ఞప్తి చేస్తున్నాం. దేవతలను దర్శించుకొని వస్తుంటే ఆ తాకిడికి షాపుల మీద పడి సామగ్రి పాడై నష్టపోయే అవకాశం ఉంటుంది. కాబట్టి రోడ్లపైన షాపులు పెట్టొద్దు. ఆదివాసీ సంఘాల సభ్యులు కూడా రోప్‌పార్టీ వారితో సమానంగా అమ్మవారిని తీసుకువచ్చేందుకు సహకరిస్తారు.



అధికారులు సమన్వయంతో పనిచేయాలి..

జాతరలో తల్లులకు సేవ చేసేందుకు సర్పంచ్‌లు లేకపోవడంతో మరింత బాధ్యత పెరిగింది. 60 రోజుల ముందే పనులను దాదాపుగా పూర్తి దశకు వచ్చేలా చర్యలు తీసుకున్నాం. గతంలో కంటే ఈసారి మంత్రిగా తల్లులను గద్దెలకు తీసుకురావడం ఒక సవాల్‌గా మారింది. అధికారులందరూ సమన్వయంతో అలర్ట్‌గా ఉండి పనిచేయాలి. కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీశ్, పీఓ అంకిత్ సహకారంతో జాతరను ముందుకు తీసుకెళ్తున్నాం. పోలీసుల సేవలు మరువలేనివి. మీడియాతో పాటు పోలీసులు నిరంతరంగా ఓపికతో పనిచేస్తున్నారు. సమ్మక్క-సారలమ్మ సన్నిధిలో విధులు నిర్వర్తించే పోలీసులు ఒత్తిడికి గురైనప్పటికీ జాతరకు వచ్చే భక్తులతో మర్యాదగా ప్రవర్తించి ఇబ్బంది లేకుండా దర్శనం జరిగేలా చూడాలి. వరదల సమయంలో శ్రీ సమ్మక్క-సారలమ్మ జాతర మొత్తం మునిగిపోయింది. కొత్తగా అన్నీ మళ్లీ కట్టుకోవాల్సి వచ్చింది. పూర్వం నుంచి వస్తున్న ఆచారాలను అవలంబిస్తూ పూజా విధానాలను పూజారులు పాటించాలి.

సమ్మక్క-సారలమ్మ అథారిటీ కమిటీ ఏర్పాటు

సమ్మక్క, సారలమ్మ జాతర చరిత్ర, సంస్కృతీ సంప్రదాయాల చరిత్ర శిలాశాసనం ఏర్పాటు చేయిస్తాం. అందుకోసం శాశ్వతంగా సమ్మక్క- సారలమ్మ డెవలప్‌మెంట్ అథారిటీ కమిటీని ప్రొఫెసర్లు, రీసెర్చ్ స్కాలర్స్, ఐఏఎస్, ఐపీఎస్‌లతో పాటు అనుభవం కలిగిన పూజారులతో కలిసి ఏర్పాటు చేయించి శిలాశాసనాలపై అమ్మవార్ల చరిత్రను లిఖిస్తాం. మేడారంలో 50 ఎకరాల భూమి తీసుకొని అందులో వనాన్ని పెంచేందుకు కృషి చేస్తాం. జంపన్నవాగు వద్ద సుందరీకరణ పనులు చేపడతాం. ప్రతీ ఏడాది ఇసుక తొలగింపు కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేయకుండా జంపన్నవాగులో శాశ్వతంగా నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకుంటాం.

వివాహ వేడుకలా..

పగిడిద్దరాజు, సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజులు ఒకే ప్రాంగణంలోని గద్దెల వద్ద కలుసుకోవడం వివాహ వేడుకలా కనిపిస్తుంది. పండుగ వాతావరణంలో మనందరం సంతోషంగా జాతరను జరుపుకుందాం. జాతర ముగిసిన తర్వాత కూడా ఇక్కడి నుంచి ఇంటికి పోవాలని అనిపించదు. తల్లుల సేవలోనే తన్మయత్వంతో స్మరిస్తూ ఉంటా. ఈ నెల 23వ తేదీన శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్, ఇతర మంత్రులు కూడా మేడారం జాతరకు వచ్చే అవకాశం ఉంది. అసెంబ్లీ ప్రాంగణంలోనే వారికి ఆహ్వానం పలికాం.

వీవీఐపీలు, వీఐపీల పాస్‌లు కట్టుదిట్టం..

మేడారం వనదేవతల దర్శనానికి వచ్చే వీఐపీలు ములుగు, వరంగల్ వద్ద వారి వాహనాలను పార్కింగ్ చేసుకొని బస్సుల్లో వచ్చి అర్ధగంటలో దర్శించుకొని పోవచ్చు. ఆర్టీసీ బస్సుల దారిలో వీఐపీల వాహనాలను అనుమతించడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని వీవీఐపీలు, వీఐపీల పాస్‌లను కూడా కట్టుదిట్టం చేశాం. వీఐపీలు, వీవీఐపీలు ఉదయం 8 నుంచి 9గంటల వరకు, మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు దర్శనానికి రావాలని సూచనలు చేస్తున్నాం. వనదేవతల ముందు అందరూ సామాన్యులే, నేను కూడా ఒకసామాన్యురాలినే. వీఐపీలు, వీవీఐపీలు కూడా అలా భావించి భక్తులకు ఇబ్బంది కలుగకుండా దర్శనానికి రావాలి.

నా చిన్నప్పుడు వారం రోజులు జాతరలోనే..

నా చిన్నప్పుడు మేడారం జాతరకు రావడానికి ములుగు మండలం సారంగపల్లి నుంచి శనివారం బయలుదేరి కాలినడకన వస్తే మంగళవారం రాత్రి మేడారం చేరుకునేది. ఉప్పు పప్పులు సేకరించుకొని మా అమ్మ సమ్మక్క ఒడిబియ్యం, కోడిని తీసుకువచ్చి.. సమ్మక్కతల్లి గద్దెకు వచ్చిన గురువారం రోజు మొక్కులు చెల్లించేది. తిరుగు ప్రయాణం శుక్రవారం రాత్రి బయలుదేరి మళ్లీ మంగళవారం కుటుంబ సభ్యులమంతా ఇంటికి చేరుకునేది. మాలాగనే అప్పుడు అనేక మంది దూర ప్రాంతాల నుంచి కాలినడకన మేడారం వచ్చి వారం రోజులు జాతరలో ఉండి సంతోషంగా గడిపి తిరిగి వెళ్లేవారు. మహాజాతరతో మా కుటుంబానికి ఎంతో అనుబంధం ఉంది. తల్లిదండ్రుల పేర్లు కూడా సమ్మక్క, సమ్మయ్య. అన్న పేరు సాంబయ్య. తల్లిదండ్రులు నా పేరు అనసూయ అని పెట్టినప్పటికీ విప్లవోద్యమంలో స మీద కలిసేలా సీతక్క అని పేరు పెట్టి పిలిచారు. వనదేవతలకు సేవ చేయడంతోనే నేను ఈ స్థాయికి ఎదిగాను. మంత్రి హోదాలో తల్లులకు సేవ చేయడం నా పూర్వజన్మ సుకృతం.

తల్లుల దీవెనలతోనే ఇందిరమ్మ రాజ్యం

- భక్తులకు అన్ని సదుపాయాలు
- మంత్రులు పొంగులేటి, సీతక్క

మేడారం.. జిగేల్

- జాతరలో నిరంతర విద్యుత్ సరఫరా
- విధుల్లో 134మంది ఇంజనీర్లు, 400మంది ఆపరేషన్ ఉద్యోగులు

- వివరాలు 8లో▸

తాళం వేసిన ఇంట్లో చోరీ

- రూ.2లక్షల నగదు, నగల అపహరణ

బచ్చన్నపేట : తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడిన సంఘటన పోచన్నపేటలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్సై కంకల సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వేముల సత్యనారాయణ జనగామ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయన భార్య, కొడుకు, కుటుంబ సభ్యులు మేడారం జాతరకు వెళ్లగా.. సత్యనారాయణ ఉదయం డ్యూటీకి జనగామకు వెళ్లాడు. రాత్రి 10 గంటలకు ఇంటికి వచ్చి లోనికి వెళ్లి చూడగా బీరువా తలుపులు పగులగొట్టి ఉంది. అందులోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో ఉన్న రూ.2 లక్షల నగదు, వెండి, బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్సై సతీష్ క్లూస్ టీం సభ్యులను రప్పించి ఫింగర్ ప్రింట్స్ సేకరించారు.



చోరీ జరిగిన ఇంట్లో ఫింగర్ ప్రింట్స్ సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు

తెలంగాణ కళావేదిక జిల్లా అధ్యక్షుడిగా ఎల్లయ్య

పాలకుర్తి: తెలంగాణ కళావేదిక జిల్లా అధ్యక్షుడిగా మండలానికి చెందిన గుగ్గిళ్ల ఎల్లయ్యను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు నకిరకంటి కిరణ్‌కుమార్, కార్యదర్శి గజవెల్లి ప్రతాప్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై పార్టీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రఘు ఆధ్వర్యంలో కళాప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



క్లుప్తంగా

కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలి

సీపీ అంబర్ కిషోర్ ఝూ



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝూ

వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు కీర్తి ప్రతిష్ఠలు తీసుకువచ్చేలా శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకోవాలని సీపీ అంబర్ కిషోర్ ఝూ శిక్షణ కానిస్టేబుళ్లకు సూచించారు. సోమవారం శిక్షణకు ఎంపికైన కానిస్టేబుళ్లతో సీపీ సమావేశం నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన కానిస్టేబుళ్ల నియామకాల్లో మొత్తం 658 మంది ఎంపికయ్యారని, 472 మంది పురుషుల్లో 291 మంది సివిల్, 181ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుళ్లు, 196 మంది మహిళల్లో 141 మంది మహిళా సివిల్, 45 మంది ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుళ్లు ఉన్నారని తెలిపారు. వీరికి తెలంగాణ పోలీస్ అకాడమీతో పాటు పీటీసీ అంబర్‌పేట, మేడ్చల్, యూసుఫ్‌గూడ బెటాలియన్‌లలో తొమ్మిది నెలల పాటు శిక్షణ ఉంటుందని సీపీ వివరించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ రాగ్యా నాయక్, ఏసీపీ అనంతయ్య, ఆర్ఐలు స్పర్జన్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న రాధ, ఎల్టా బాధ్యులు

విద్యారణ్యపురి: విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీసేందుకు డ్రామా పోటీలు దోహదపడుతాయని జిల్లా డీఈఓ కార్యాలయ కమ్యూనిటీ మొబలైజింగ్ కోఆర్డినేటర్ బి.రాధ అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లాలోని ముచ్చర్ల మిలీనియం పాఠశాలలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి డ్రామా పోటీలు నిర్వహించారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఎల్టా) ఆధ్వర్యంలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, టీఎస్‌ఆర్ఎస్‌కు చెందిన విద్యార్థులు డ్రామా పోటీల్లో అద్భుత ప్రదర్శనలిచ్చారు.ఈ సందర్భంగా రాధ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇంగ్లిష్ ప్రపంచ భాషగా మారిందని అందుకు విద్యార్థులు సైతం ఆంగ్లంపై పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎల్టా రాష్ట్ర అధ్యక్షుడు టి. వెంకటేశ్వర్‌రావు, అసోసియేట్ అధ్యక్షుడు పూల శ్రీనివాస్, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు పి.సంపత్ కుమార్, వి.లక్ష్మణ్, ఆర్గనైజర్ కె.రవికుమార్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కాగా జిల్లాస్థాయి డ్రామా పోటీల్లో ప్రతిభను చూపిన విద్యార్థులు ఈనెల26వ తేదీన జరిగే రాష్ట్రస్థాయి డ్రామా పోటీలకు ఎంపికయ్యారు.

నేడు మేడారానికి పగిడిద్దరాజు ప్రయాణం



పూనుగొండ్లలో గద్దెపై ప్రతిష్ఠించిన పగిడిద్దరాజు పాన్పు

గంగారం: మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల గ్రామంలోని గుడి నుంచి సమ్మక్క భర్త పగిడిద్ద రాజు మంగళవారం మేడారానికి బయలుదేరనున్నారు. ఈ మేరకు ఆలయంలో ప్రత్యేక పూజలు జరుపుతారు. అనంతరం గుట్ట నుంచి వనం తీసుకొచ్చే కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తారు. వనం తీసుకొచ్చే సందర్భంగా మహిళలు బిందెలతో నీళ్ల ఆరబోస్తారు. అనంతరం గద్దెపై పగిడిద్దరాజును ప్రతిష్ఠించి పెళ్లికొడుకుగా ముస్తాబు చేస్తారు. మధ్యాహ్నం తరువాత పూనుగొండ నుంచి మేడారానికి ప్రధాన పూజారులు కాలినడకన అరణ్యం గుండా తీసుకెళ్తారు. ఆ సమయంలో మహిళలు సంతు పడుతూ నీళ్ల బోరుస్తూ పగడిద్దరాజును ఊరినుంచి సాగనంపుతారు. బుధవారం సాయంత్రం వరకు మేడారం గద్దెపైకి చేరుకుంటారు. అనంతరం భక్తుల దర్శనార్థం కొలుదీరుతారు.

జంపన్నవాగు సమీపంలోని జంపన్న గద్దె



నేడు గద్దెపైకి జంపన్న..

ఎస్ఎస్‌తాడ్వాయి: జంపన్నను పడిగె రూపంలో మంగళవారం జంపన్నవాగు సమీపంలోని గద్దెపై ప్రతిష్ఠించనున్నారు. కన్నెపల్లి నుంచి పూజారి పి.సత్యం జంపన్న పడిగెను డోలు వాయిద్యాల నడుమ తీసుకొచ్చి జంపన్నవాగు గద్దె పై ప్రతిష్ఠించి పూజలు నిర్వహించనున్నారు. ఈనెల 21న కన్నెపల్లి నుంచి సారలమ్మ రాకకు ముందు జంపన్నను పడిగె రూపంలో గద్దెపై ప్రతిష్ఠిస్తారు.


జంపన్న వాగు చేరిన లక్నవరం జలాలు..



ఆసియా ఖండంలోనే అతిపెద్ద జాతరైన మేడారం మహా జాతర 21 నుంచి 24వ తేదీ వరకు జరగనుంది. ఈ నేపథ్యంలో అధికారులు గోవిందరావుపేట మండలం లక్నవరం నుంచి జలాలు విడుదల చేయగా సోమవారం జంపన్నవాగుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా భక్తులు వాగులో పుణ్యస్నానాలు ఆచరించారు.

- ఎస్ఎస్‌తాడ్వాయి/ఏటూరునాగారం

మేడారం.. జిగేల్



విద్యుత్ కాంతుల్లో మెరుస్తున్న వనం

- జాతరలో నిరంతరాయంగా విద్యుత్
- రెండు సబ్‌స్టేషన్ల ద్వారా సరఫరా
- 208 విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- విధుల్లో 134 మంది ఇంజనీర్లు, 400 మంది ఆపరేషన్ ఉద్యోగులు
- విద్యుత్ లైన్లు తెగకుండా ముందు జాగ్రత్త చర్యలు



విద్యుత్ వెలుగులో వనదేవతల గద్దెలు

హన్మకొండ: వనదేవతలు సమ్మక్క, సారలమ్మ జాతర జరిగే మేడారం విద్యుత్ వెలుగుల్లో కాంతులీనుతోంది. గద్దెల ప్రాంతం మొదలు.. భక్తులు ఆవాసం ఏర్పరుచుకునే ప్రాంతాల వరకు విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఫలితంగా మేడారంలో విద్యుత్ వెలుగులు జిగేలుమంటున్నాయి. రాత్రి సమయం కూడా పగలు మాదిరి కనిపిస్తోంది. రూ.16,73,23,660 అంచనా వ్యయంతో జాతరలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగేలా టీఎస్ ఎన్పీడీసీఎల్ అన్ని ఏర్పాట్లు చేసింది. రెండు సబ్ స్టేషన్ల ద్వారా 24 గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ అందించనున్నట్లు అధికారులు తెలిపారు. మేడారం కొత్తూరు 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో 8 ఎంవీఏ సామర్థ్యం కలిగిన 2 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, సమ్మక్క సబ్ స్టేషన్ (కొత్త)లో 5 ఎంవీఏ సామర్థ్యం కలిగిన రెండు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఈ రెండు సబ్ స్టేషన్లకు అంతరాయం కలుగకుండా రెండు వైపుల నుంచి విద్యుత్ సరఫరా అయ్యేలా ఏర్పాట్లు చేశారు. అదే విధంగా జాతరకు ఏటా భక్తుల సంఖ్య పెరుగుతున్న క్రమంలో విద్యుత్ సరఫరాలో వైఫల్యాలకు తావు లేకుండా ఉండేందుకు 208 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఇందులో 315 కేవీఏ సామర్థ్యం కలిగినవి నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు, 160 కేవీఏ సామర్థ్యం కలిగినవి 84, 100 కేవీఏ సామర్థ్యం కలిగినవి 96, 25 కేవీఏ సామర్థ్యం కలిగినవి 24 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. 65.8 కిలో మీటర్ల హెచ్‌టీ లైన్, ఎల్‌టీ లైన్ వేశారు. కాగా, విద్యుత్ లైన్లు తెగి భూమిపై పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా 7,500 ఫోర్ వైర్ స్పేసర్స్ ఏర్పాటు చేసింది. నాలుగు వైర్లలో ఏ ఒక్కటి తెగినా నేలపై పడకుండా ఫోర్ వైర్ స్పేసర్స్ అడ్డుకుంటాయి.

మేడారం తరలిన సిబ్బంది..

జాతరలో ఏ మాత్రం అంతరాయం కలిగినా, చిన్న వైఫల్యాలు ఎదురైనా వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు టీఎస్ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం.. అధికారులు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బందిని మేడారానికి తరలించింది. వీరంత సోమవారం మేడారం చేరుకుని వారికి కేటాయించిన ప్రాంతాల్లో విధుల్లో చేరారు. ఈ నెల 25వ తేదీ వరకు మేడారం జాతరలో సేవలు అందిస్తారు. ఇద్దరు సీజీఎంలు వి.మోహన్ రావు, కిషన్ పర్యవేక్షణలో నలుగురు సూపరింటెండెంట్ ఇంజనీర్లు, 10 మంది డివిజన్ ఇంజనీర్లు, 120 మంది అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, సబ్ ఇంజనీర్లు, 400 మంది ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఉద్యోగులు, మరో 40 మంది కాంట్రాక్ట్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరు వారికి కేటాయించిన ప్రాంతాల్లో లైన్ పెట్రోలింగ్ చేస్తూ లోపాలను గుర్తిస్తూ సరి చేస్తారు. అందుకు కావాల్సిన మెటీరియల్‌ను సిద్ధంగా ఉంచుకున్నారు. రాత్రి, పగలు నిరంతరాయంగా విధులు నిర్వహిస్తూ భక్తులకు విద్యుత్ పరంగా ఇబ్బందులు తలెత్తకుండా చూస్తారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద గద్దెల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.

తల్లుల దీవెనలతోనే ఇందిరమ్మ రాజ్యం

- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



సమ్మక్క గద్దెకు పూలమాల వేస్తున్న మంత్రి పొంగులేటి



అమ్మవారికి మొక్కుతున్న మంత్రి సీతక్క

ఏటూరునాగారం/ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క, సారలమ్మ దీవెనలతోనే తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం (కాంగ్రెస్ ప్రభుత్వం) ఏర్పడిందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం తల్లులను దర్శించుకున్న అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో స్థానిక ఎమ్మెల్యే సీతక్క ఆధ్వర్యంలో జాతర కనీవినీ ఎరగని రీతిలో జరుగుతోందన్నారు. ఇప్పటి వరకు దాదాపు 50 లక్షల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారన్నారు. ఓ వైపు అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగా మరో వైపు భక్తుల సౌకర్యార్థం సీతక్క నిత్యం జాతర పనులు పర్యవేక్షిస్తూ అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. గత ప్రభుత్వం మేడారం జాతర అభివృద్ధికి రూ. 75 కోట్లు ఖర్చు చేస్తే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 110 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు జాతరను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. జాతరకు ఇంకా 2 కోట్ల మంది భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. గత ప్రభుత్వం 3 వేల ఆర్టీసీ బస్సులు నడపగా ప్రస్తుత ప్రభుత్వం మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో 6 వేల బస్సులు నడుపుతోందన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామన్నారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు జీరో టికెట్‌పై 17 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారన్నారు. జాతర నిర్వహణకు 16 వేల మంది అధికారులు పనిచేస్తున్నారన్నారు. జాతరపై అనుభవమున్న ఐదుగురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించామన్నారు. జాతరకు అనుసంధానమయ్యే సుమారు 270 కిలో మీటర్ల మేర నూతన రహదారులు నిర్మించామన్నారు. భక్తులు అధికారులకు సహకరించి తమ మొక్కులు చెల్లించుకోవాలన్నారు.

వన దేవతలను దర్శించుకున్న మంత్రులు

మేడారం సమ్మక్క, సారలమ్మలను రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క దర్శించుకున్నారు. తొలిసారి మంత్రి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి హోదాలో మేడారం విచ్చేసిన మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి మంత్రి సీతక్క, కలెక్టర్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూజారులు మంత్రులకు పట్టు వస్త్రాలు అందజేశారు. అలాగే, డీజీపీ రవిగుప్తా తల్లులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. హెలికాప్టర్‌లో మేడారం చేరుకున్న రవిగుప్తాకు ఎస్పీ శబరీశ్ ఘన స్వాగతం పలికారు. అనంతరం డీజీపీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మీడియా పాయింట్, మీడియా సెంటర్‌ను ప్రారంభించిన మంత్రులు

మేడారం గద్దెల సమీపంలోని మంచె(మీడియాపాయింట్), టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క ప్రారంభించారు. అనంతరం ఆయుర్వేదిక్ వైద్యశాలలను కూడా ప్రారంభించారు.

వెయ్యి ఏళ్లు గుర్తుండేలా శిలాశాసనం : మంత్రి సీతక్క

సమ్మక్క, సారలమ్మ చరిత్ర వెయ్యి సంవత్సరాలు గుర్తుండేలా మేడారంలో శిలాశాసనం ఏర్పాటు చేస్తామని మంత్రి సీతక్క అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో బడ్జెట్‌లో మేడారం సమ్మక్క, సారలమ్మకు రూ. 110 కోట్లు కేటాయించామన్నారు. తల్లిదీవెనతో కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు కావాల్సి న సౌకర్యాలు కల్పించుకుందామన్నారు. భక్తులు స్వీయ రక్షణతో జాతరకు వచ్చి క్షేమంగా వెళ్లాలని ఆకాంక్షించారు. ఏమైనా సమస్యలుంటే మీడియా, తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అంతేకాకుండా వీఐపీలు కూడా ములుగు వద్ద తమ వాహనాలను పార్కింగ్ చేసి ఆర్టీసీ బస్సుల్లో వస్తే ట్రాఫిక్ సమస్య ఉండదని సూచించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీఓ అంకిత్, ఎస్పీ శబరీశ్, ఈఓ రాజేంద్రం, జాతర చైర్మన్ లచ్చుపటేల్, డైరెక్టర్ కిశోర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి పక్కన మంత్రి సీతక్క, కలెక్టర్, ఎస్పీ, పీఓ, ఇతర అధికారులు

అమ్మవార్ల సేవలో తరించడానికి..

- నేడు మేడారానికి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, అధికారులు



కేయూ క్యాంపస్: జాతరలో అమ్మవార్లు, భక్తులకు సేవలందించేందుకు కాకతీయ యూనివర్సిటీ నుంచి జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) వలంటీర్లు, అధికారులు మేడారం వెళ్లనున్నారు. యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల నుంచి డిగ్రీ కళాశాలల నుంచి ఎంపిక చేసిన 200 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, అధికారులు మంగళవారం క్యాంపస్‌లోని ఎన్ఎస్ఎస్ కార్యాలయానికి చేరుకుంటారు. ఇక్కడి నుంచి బస్సుల్లో మేడారం వెళ్లనున్నారు. జాతరలో గద్దెలు, జంపన్నవాగు, ఆర్టీసీ బస్సుల క్యూలైన్ల తదితర చోట్ల సేవలు అందించబోతున్నారు. ప్రతి రెండేళ్లొకసారి జరిగే మేడారంలో కేయూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సేవలు అందిస్తున్నారు. ఇందులోభాగంగా 2022లో జరిగిన జాతరకు 400మంది సేవలు అందించారు. అయితే ఈసారి ఎక్కువగా ఆ ప్రాంతంలోని విద్యార్థులను వినియోగించుకుంటున్న నేపథ్యంలో 200మంది మాత్రమే కావాలని సంబంధిత జిల్లా అధికారులు యూనివర్సిటీ అధికారులను కోరారు. దీంతో కేయూ పరిధిలోని డిగ్రీ కళాశాలల నుంచి 200మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, 10మంది ఆఫీసర్లను పంపబోతున్నారు. అయితే పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు అధికారులు మరో వంద మందిని పంపాలని కోరినట్లు సమాచారం. జాతరను వారం రోజుల ప్రత్యేక శిబిరంగా పరిగణిస్తారని కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ తెలిపారు.

బస్సుల్లో తల్లుల చెంతకు..

- ఆర్టీసీ ద్వారా 76,712 మంది భక్తుల ప్రయాణం



హన్మకొండ: మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు ఆర్టీసీ బస్సుల ద్వారా సోమవారం రాత్రి 8 గంటల వరకు 76,712 మంది భక్తులు ప్రయాణించారు. ఈ నెల 18 నుంచి ఆర్టీసీ ప్రత్యేక పాయింట్ల నుంచి బస్సులు నడపుతోంది. ఈ రెండు రోజుల్లో 1,225 ట్రిప్పుల ద్వారా 44,961 మంది భక్తులు మేడారం చేరుకున్నారు. అదే విధంగా 1,223 ట్రిప్పుల ద్వారా 31,751మంది తిరుగు ప్రయాణమయ్యారు. ఈ నెల 18న 850 ట్రిప్పుల ద్వారా 31,690మంది ప్రయాణికులను మేడారం చేరవేయగా, 800 ట్రిప్పుల ద్వారా 22,731 మంది తిరుగుబాట పట్టారు. అదే విధంగా సోమవారం రాత్రి 8 గంటల వరకు 375 ట్రిప్పుల ద్వారా 13,271 మంది భక్తులు మేడారం చేరుకున్నారు. 400 ట్రిప్పుల ద్వారా 9020 మంది భక్తులు తిరుగు ప్రయాణమయ్యారు. మహిళలకు ఉచిత్ర ప్రయాణ సౌకర్యం కల్పించినా అధికారులు ఊహించిన మేరకు స్పందన కనిపించడం లేదు. 2020 జాతరకు దాదాపు సరిసమానంగా భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. జాతర 21 నుంచి 24 వరకు జరగనుంది. ఈ క్రమంలో వచ్చే ఐదు రోజుల్లో భక్తుల సంఖ్య పెరగొచ్చని ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు.


స్టాంప్ వెండర్ అనుమతికి 25సార్లు తిరిగా..

- ఏసీబీని ఆశ్రయించిన బాధితుడి ఆవేదన

వరంగల్ క్రైం : స్టాంప్ వెండర్ అనుమతికి జిల్లా రిజిస్ట్రేషన్ ఆఫీస్ చుట్టూ 25సార్లు తిరిగా.. అయినా అనుమతి ఇవ్వకపోవడంతో విసిగి ఏసీబీ అధికారులను ఆశ్రయించినట్లు బాధితుడు జిల్లా రిజిస్ట్రార్‌కు లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చాడు. సోమవారం జిల్లా రిజిస్ట్రార్‌ను కలిసిన ఏసీబీ అధికారులను ఆశ్రయించడానికి స్టాంప్ వెండర్ లైసెన్స్ ఇచ్చే సంబంధిత అధికారి ఏడాదిగా వేధించిన తీరును డీఆర్‌కు విన్నవించుకున్నాడు. సాక్షిలో ఈనెల 15న ప్రచురితమైన 'ఏసీబీలో లీకువీరులు' కథనం అవినీతి నిరోధక శాఖతో పాటు జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ప్రకంపనలు సృష్టించింది. ఏసీబీ అధికారుల తీరుపై రాష్ట్ర ఏసీబీ ఉన్నతాధికారులు, సామాజిక మాధ్యమాల ద్వారా సామాన్యులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. స్టాంప్స్, రిజిస్ట్రేషన్ డీఐజీ మాదాసి సుభాషిణి వచ్చి కార్యాలయంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను ఎండగట్టారు. సోమవారం జిల్లా రిజిస్ట్రార్ హరికొట్ల రవి బాధితుడిని విచారణలో భాగంగా పిలవడంతో తనకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. కన్నీళ్లు పెట్టుకున్న కనికరించలేదని, వాయిదాలు పెడుతూ ఇబ్బందులకు గురిచేశారని బాధితుడు డీఆర్‌కు వివరించినట్లు తెలిసింది.

హ్యాండ్‌బాల్ చాంపియన్ వరంగల్, రంగారెడ్డి

- ద్వితీయస్థానాల్లో హైదరాబాద్, వరంగల్



పురుషుల విభాగంలో చాంపియన్‌గా నిలిచిన వరంగల్ జట్టు

కరీంనగర్‌స్పోర్ట్స్: 52వ తెలంగాణ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పురుషుల చాంపియన్‌గా వరంగల్ జట్టు, మహిళా చాంపియన్‌గా రంగారెడ్డి జిల్లా జట్లు నిలిచాయి. పురుషుల విభాగంలో హైదరాబాద్ ద్వితీయ, కరీంనగర్ తృతీయ స్థానం సాధించగా మహిళల విభాగంలో వరంగల్ ద్వితీయ, కరీంనగర్ తృతీయ స్థానాలు సాధించాయి. కరీంనగర్‌లోని లయోలా జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సీనియర్ హ్యాండ్‌బాల్ పోటీలు సోమవారం రాత్రి ముగిసాయి.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

వేర్వేరు కారణాలతో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో యువకుడు, ఇదే మండలం శివునిపల్లిలో యువతి, యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలో వ్యక్తి బలవన్మరణం పొందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.



రాజునాయక్ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెంది స్టేషన్ ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి చెందిన కొర్ర రాజునాయక్(23) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం జాఫర్‌గూడెం గ్రామ శివారు జాలితండాకు చెందిన రాధ కొన్నేళ్లుగా ఘన్‌పూర్‌లో కూరగాయలు అమ్ముతూ జీవనం సాగిస్తుంది. ఆమె కుమారుడు రాజునాయక్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రాజునాయక్‌కు ఏడు నెలల క్రితం హైదరాబాద్‌కు చెందిన సంగీతతో వివాహం జరిగింది. అయితే దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో గతేడాది డిసెంబర్‌లో సంగీత ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ ఘటనలో పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు ట్రేస్ చేసి సంగీతను తీసుకువచ్చారు. అనంతరం కూడా కాపురానికి రాకుండా తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. ఈ క్రమంలో మనస్తాపం చెందిన రాజు నా యక్ ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ముస్కె రాజు తెలిపారు.

తల్లిదండ్రుల కలహాలతో యువతి..



సన్నిధి(ఫైల్)

తల్లిదండ్రుల కలహాలతో మనస్తాపం చెందిన ఓ యువతి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన ఆదివారం రాత్రి జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం శివునిపల్లిలో జరగగా సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. జీపీలో వాటర్‌మెన్‌గా పనిచేస్తున్న గుండ్లపెల్లి రాజుకు భార్య హైమావతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె సన్నిధి(17) నమిలిగొండ శివారు ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ఇంటర్ ఫస్టియర్ (బైపీసీ), చిన్న కుమార్తె ప్రసన్న తొమ్మిదో తరగతి చదువుతోంది. ఈ క్రమంలో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు జరిగాయి. ఈ విషయమై పెద్ద కుమార్తె సన్నిధి తరచూ బాధపడేది. వారం క్రితం హైమావతి చిన్న కుమార్తెను తీసుకుని జఫర్‌గఢ్ మండలం తమ్మడపల్లిలోని తన పుట్టింటికి వెళ్లగా.. ఇంట్లో రాజు, అతడి పెద్ద కుమార్తె సన్నిధి ఉంటున్నారు. ఆదివారం ఉదయం బయటకు వెళ్లిన రాజు ఇంటికి రాలేదు. రాత్రి 7.45 గంటల సమయంలో సన్నిధి తండ్రికి ఫోన్ చేసి భోజనానికి త్వరగా రమ్మనగా.. పని ఉంది.. ఆలస్యమవుతుందని చెప్పిన అతను రాత్రి పది గంటల సమయంలో ఇంటికి చేరుకున్నాడు. ఎంత పిలిచినా కుమార్తె పలకకపోవడంతో బలవంతంగా తలుపులు తెరిచి చూడగా సన్నిధి ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించింది. దీంతో రాజు చుట్టుపక్కల వారిని పిలిచి కుమార్తెను కిందకు దింపి చూడగా అప్పటికే మృతిచెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో గొర్రెల కాపరి..

రాజాపేట: ఆర్థిక ఇబ్బందులతో ఓ గొర్రెలకాపరి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం నారాయణపురం గ్రామానికి చెందిన పదిరె సాయి మల్లయ్య (40) గొర్రెల కాపరి. దీంతోపాటు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మల్లయ్యకు రాజాపేట మండలం బొందుగుల రెవెన్యూ పరిధిలో కొంత వ్యవసాయ భూమి ఉంది. అయితే కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం తన వ్యవసాయ బావి వద్దకు వచ్చి ఆత్మహత్య చేసుకుంటున్నానని భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. ఆమెతో పాటు ఇతర కుటుంబ సభ్యులు, బంధువులు వెంటనే వ్యవసాయ బావి వద్దకు రాగా అప్పటికే మల్లయ్య చెట్టుకు ఉరేసుకుని కనిపించడంతో లబోదిబోమన్నారు. రాజపేట ఏఎస్సై మైసయ్య ఘటనాస్థలిని పరిశీలించి మల్లయ్య ఆత్మహత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. మల్లయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ఆస్పత్రికి తరలించారు. ఆర్థిక ఇబ్బందులతోనే తన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడని మల్లయ్య భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై మైసయ్య తెలిపారు.